సాక్షి
అనంతపురం
మంగళవారం ǀ 19 ǀ మార్చి ǀ 2024



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.32	సెహరీ : 5.08



న్యూస్‌రీల్

ఈవీఎంలకు పటిష్ట భద్రత



ఈవీఎంల భద్రతా వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఈవీఎంలు భద్రపరచిన గదుల వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. పాత ఆర్‌డీఓ కార్యాలయం ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన గోదామును కలెక్టర్ సోమవారం సందర్శించి, ఈవీఎంలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేస్తూ ఉండాలని చెప్పారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ధర్మవరం నుంచి వచ్చిన 94 ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ (ఫస్ట్ లెవల్ చెకింగ్)ను కలెక్టర్ పరిశీలించారు. ప్రక్రియను పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. ఆమె వెంట ఈవీఎం మేనేజ్‌మెంట్ కమిటీ నోడల్ అధికారి, నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణా రెడ్డి, తదితరులున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శన..

కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమాండ్ కంట్రోల్ రూమ్, ఎన్‌ఐసీలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) సెంటర్‌ను కలెక్టర్ సోమవారం సందర్శించారు. ఎంసీసీ, ఎక్స్‌పెండేచర్, ఫీల్డ్ మేనేజ్మెంట్, ఎన్‌జీఆర్ఎస్, సీ–విజిల్, కంప్లైంట్ రిసెప్షన్, 1950 కాల్‌సెంటర్ తదితర యూనిట్ల నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ నిరంతరం ఉండాలన్నారు. వెబ్‌కాస్టింగ్, ఈఎస్‌టీ, ఎస్ఎస్‌టీలను కూడా పర్యవేక్షించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి నివేదికలను రిటర్నింగ్ అధికారుల నుంచి సకాలంలో తెప్పించుకోవాలని ఆదేశించారు. మీడియాలో వచ్చే వ్యతిరేక కథనాలు, వార్తలకు సంబంధించి నివేదికలను అందించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల దరఖాస్తులపై విచారణ



ఉద్యోగులను విచారిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ ఉద్యోగులు చేసుకున్న దరఖాస్తులపై మ్యాన్‌పవర్ కమిటీ సోమవారం విచారణ చేపట్టింది. దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, ఆరోగ్య సమస్యలున్న వారు మొత్తం 680 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై రోజుకు 200 మంది చొప్పున సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు విచారణ చేయనున్నారు. కమిటీ సభ్యులు డీఎంహెచ్ఓ ఈ.భ్రమరాంబదేవి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అంజన్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి రోజు సచివాలయ, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఐసీడీఎస్ శాఖల ఉద్యోగులను విచారించారు. 19, 20 తేదీల్లో ఉపాధ్యాయులు, మునిసిపల్ ఉద్యోగులను విచారించనున్నారు.

మట్టిని మింగిన అమిలినేని!

రూ. 2 కోట్ల విలువైన ఎర్రమట్టి హాంఫట్

కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు బడా కాంట్రాక్టర్. ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ (ఎస్ఆర్‌సీ) సంస్థ ద్వారా రాష్ట్రంలోనే కాకుండా కర్ణాటకలోనూ వివిధ పనులు చేస్తుంటారు. నిబంధనలు ఉల్లంఘించడం, నిధులు కొల్లగొట్టడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. పనుల్లో అక్రమాలకు పాల్పడడమే కాదు..పనులు అడ్డుపెట్టుకుని ఇసుక, మట్టి, చెట్టు, నీరు వంటి సహజ వనరులనూ కొల్లగొడుతున్నారు. తద్వారా పోగు చేసుకున్న కరెన్సీ కట్టలను వెదజల్లి నేడు కళ్యాణదుర్గంలో గెలవాలని కుయుక్తులు పన్నుతున్నారు. కాగా..భైరవానితిప్ప ప్రాజెక్టు పనుల్లో ఎర్రమట్టి అక్రమ తరలింపు ద్వారా ఆయన కొల్లగొట్టిన రూ.కోట్ల వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయంపై హంద్రీనీవా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.

- జీడిపల్లి– జీటీపీ కాలువ పనుల్లో అక్రమాలు
- యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు
- రూ.2 కోట్లకు పైగా విలువైన మట్టి స్వాహా
- విచారణకు ఆదేశించిన హంద్రీనీవా అధికారులు



జీటీపీ కాలువ తవ్వకంలో భాగంగా ఎర్రమట్టిని తవ్వి టిప్పర్లలో తరలిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: హంద్రీనీవా పథకం కింద బెళుగుప్ప మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్ నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తరలించే పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా తీసుకుంది. గత టీడీపీ ప్రభుత్వం మరుగున పడేసిన ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం పట్టాలెక్కించింది. రూ.542 కోట్ల ఈ పనులకు సంబంధించి భూసేకరణ నిమిత్తం రూ. 208.85 కోట్లు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న బిల్లులు దాదాపు రూ. 8 కోట్లు కూడా చెల్లించారు. బీటీపీ కింద 12,400 ఎకరాలు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువుల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు రెండు నియోజకవర్గాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే మహోన్నత ఆశయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది.

'మట్టి' కొల్లగొట్టారు

జీడిపల్లి– భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల కాంట్రాక్టును 2018లోనే ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దక్కించుకుంది. టీడీపీ హయాంలో నిధులు ఇవ్వకపోవడంతో పనులు చేపట్టలేదు. అయితే, వైఎస్ జగన్ ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ఇటీవల పనులు ప్రారంభించారు. ప్రధాన కాలువ నిర్మాణంలో భాగంగా కొన్ని కిలోమీటర్ల మేర తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలోనే అమిలినేని సురేంద్రకు చెందిన సదరు కాంట్రాక్టు సంస్థ అక్రమాలకు తెరతీసింది. తవ్వితీసిన మట్టిని తరలించరాదనీ, ఒకవేళ అవసరం ఏర్పడితే అనుమతులు తీసుకోవాలనే నిబంధనలున్నా పట్టించుకోకుండా 40 వేల క్యూబిక్ మీటర్ల దాకా ఎర్రమట్టిని అక్రమంగా తరలించేసింది. ప్రస్తుతం టిప్పర్ ఎర్రమట్టి (12 క్యూబిక్ మీటర్ల మట్టి) విలువ రూ.6 వేలకు పైగా ఉంది. దీన్నిబట్టి రూ.2 కోట్లకు పైగా మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం హంద్రీనీవా ఉన్నతాధికారులు కాలువ పనులను తనిఖీ చేయగా.. అక్రమాలు వెలుగుచూశాయి.

ఈఈకి భారీగా ముడుపులు!

సదరు కాంట్రాక్టు సంస్థతో హంద్రీనీవాలో పని చేస్తున్న ఓ ఈఈ కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులను పర్యవేక్షించాల్సిన ఆయన కాంట్రాక్టు సంస్థకు కొమ్ముకాసినట్లు విమర్శలు వస్తున్నాయి.అక్రమ వ్యవహారమంతా ఆయన కనుసన్నల్లోనే జరిగిందని, ఇందుకు భారీగా ముడుపులు ముట్టాయని అధికారవర్గాలే బాహాటంగా పేర్కొంటున్నాయి. కొన్ని రోజుల క్రితం ఈ మట్టి అక్రమ తరలింపు వ్యవహారం బయటకు పొక్కడంతో కాంట్రాక్టు సంస్థను కాపాడేందుకు సదరు ఈఈ శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

నివేదిక రాగానే చర్యలు

జీడిపల్లి–భైరవాని తిప్ప ప్రాజెక్టు పనుల్లో భాగంగా కొన్ని కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ నిర్మాణం జరిగింది.ఇక్కడ తవ్విన మట్టిని సదరు కాంట్రాక్టు సంస్థ తీసుకెళ్లినట్లు మాదృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఈఈ వివరణ కోరాం. నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నారా అని ప్రశ్నించాం. నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– దేశేనాయక్, ఎస్ఈ, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు

కదిరికి బ్రహ్మోత్సవ శోభ

- ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ
- సకల దేవతలకు ఆహ్వానం పలకనున్న అర్చకులు



యాగశాలలో కొలువు దీరిన శ్రీవారు (ఫైల్)

కదిరి: పక్షం రోజుల పాటు నిర్వహించే ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి 2024 వార్షిక బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ జరగనుంది. పాల్గుణ కృష్ణ దశమి మంగళవారం (19న) సూర్యాస్తమయం తర్వాత అర్చకులు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. వసంత వల్లభునిగా పూజలందుకునే ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలతో కదిరి నూతన శోభను సంతరించుకుంది.

స్వామి ఆశీస్సుల కోసం..

బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ ఘట్టానికి విశేష ప్రాధాన్యత ఉంది. నవ ధాన్యాలు మొలకెత్తడాన్ని అంకురార్పణ అంటారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు పొందటమే ఈ అంకురార్పణ ఘట్టం ముఖ్య ఉద్దేశం. ఈ ఘట్టంలో అర్చక పండిత బృందం అగ్నిహోమం ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ తదితర అనేక సకల దేవతలను ఆహ్వానిస్తారు.

నవధాన్యాలతో మొలక

సకల దేవతల ఆహ్వానం అనంతరం భూమాతను ప్రార్థిస్తూ పాలిక (కొత్తకుండ)లను మట్టితో నింపుతారు. చంద్రున్ని ప్రార్థిస్తూ వేద పండితులు అందులో నీరు పోసి నవ ధాన్యాలు చల్లుతారు. ఈ పాలికలకు నూతన వస్త్రాన్ని అలంకరించి పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం అర్చకులు.. సోమరాజ, వరుణ మంత్రాలతో పాటు విష్ణుసూక్తం పఠిస్తారు. బ్రహ్మోత్సవాల్లో అర్చకులు రోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోసి నారు పెరిగేందుకు సహకరిస్తారు. ఈ మొత్తం తంతు వేద మంత్రోచ్ఛారణ, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహిస్తారు.

వంచకుడికి వంత పాడతారా?

- జేసీ ప్రభాకర్ రెడ్డిపై బాధితురాలి ఆగ్రహం



తనకు జరిగిన అన్యాయాన్ని చెబుతూ విలపిస్తున్న బాధితురాలు

తాడిపత్రి రూరల్: 'ఓ ప్రజాప్రతినిధిగా మహిళలకు అండగా నిలబడాల్సింది పోయి, మోసం చేసిన వాళ్లకే వంత పాడతారా? ఇదేనా మహిళలకు మీరిచ్చే గౌరవం' అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డిపై టీడీపీ కౌన్సిలర్ చేతిలో వంచనకు గురైన బాధితురాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరుడు, తాడిపత్రి 30వ వార్డు కౌన్సిలర్ మల్లికార్జున ప్రేమ పేరుతో వాడుకుని వదిలేయడంతో పాటు చంపుతానని బెదిరిస్తుండడంతో ఓ అభాగ్యురాలు ఇటీవల పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో మల్లికార్జునను మందలించి, ఆమెకు న్యాయం చేయాల్సిన జేసీ ప్రభాకర్ రెడ్డి అందుకు భిన్నంగా ఇటీవల టీడీపీ నాయకులతో కలిసి కౌన్సిలర్‌కు మద్దతుగా స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేశారు. దీనిపై సోమవారం బాధితురాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని వారం రోజుల క్రితం జేసీని కలిస్తే తనను అవమానించారని వాపోయారు. మల్లికార్జున తనను శారీరకంగా వాడుకుని, మోజు తీరాక మరో యువతితో తిరుగుతున్నాడని ఆయన దృష్టికి తీసుకెళ్తే హనీ ట్రాప్ అంటూ తనపైనే దౌర్జన్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లికార్జునతో వివాహం చేయనని కరాఖండీగా చెప్పారని వెల్లడించారు.జేసీ చేసిన అవమానం భరించడం కంటే చనిపోవడమే మేలంటూ విలపించారు. తనకు న్యాయం జరిగేంత వరకూ పోరాడతానని స్పష్టం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్‌ను కలిసి జరిగిన అన్యాయాన్ని వివరించనున్నట్లు తెలిపారు. వారు న్యాయం చేయకుంటే మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తానన్నారు. తనకు మల్లికార్జునతో వివాహం చేయిస్తానని హామీ ఇచ్చేంతవరకు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తానన్నారు. మహిళ అని కూడా చూడకుండా సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడుతూ టీడీపీ నాయకులు వేధిస్తున్నారని వాపోయారు. కాగా, బాధితురాలు సోమవారం రాత్రి ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగను కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

సిగ్గనిపించడం లేదా జేసీ?



టీడీపీ కౌన్సిలర్ చేతిలో వంచనకు గురైన బాధితురాలికి న్యాయం చేయాల్సిన జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆమెపైనే దౌర్జన్యం చేయడం దుర్మార్గం. మల్లికార్జున అమాయకుడంటూ పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేయడానికి సిగ్గుండాలి. పైగా వంచకుడి తప్పును కప్పిపుచ్చడానికి సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టిస్తూ బాధితురాలిని మానసికంగా వేధించడం హేయం. ప్రజలు జేసీ ప్రభాకర్ రెడ్డి అరాచకాలను గమనిస్తున్నారు. వాళ్లే మళ్లీ తగిన గుణపాఠం చెబుతారు.

– ఎమ్మెల్యే పెద్దారెడ్డి

'పది' పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 2,495 మంది విద్యార్థుల గైర్హాజరు

అనంతపురం/ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 142 కేంద్రాల్లో తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 34,074 మంది విద్యార్థులకు గాను 31,579 మంది హాజరయ్యారు. 2,495 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

అనంతపురం నగరంలో మొదటి రోడ్డులోని శారదా నగరపాలక ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఎం.గౌతమి తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది సమన్వయంతో పని చేసి పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని కోరారు.



అనంతపురంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

- జిల్లా పరీక్షల పరిశీలకులు, ప్రాథమిక విద్య ఆర్జేడీ రాఘవరెడ్డి కూడా వివిధ కేంద్రాలను తనిఖీ చేశారు. ముందుగా కూడేరు పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాల తరలింపును ఆయన పరిశీలించారు. అక్కడి నుంచి కణేకల్లుకు చేరుకుని మూడు పరీక్ష కేంద్రాలు, రాయదుర్గంలో మూడు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం అనంతపురం చేరుకుని పొట్టి శ్రీరాములు నగర పాలక ఉన్నత పాఠశాల, నేతాజీ సుభాష్ చంద్ర బోస్ నగరపాలక ఉన్నత పాఠశాలల్లో ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట డీఈఓ వరలక్ష్మీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మ రథోత్సవం చూతము రారండి

ఉరవకొండ: ప్రసిద్ధి గాంచిన ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం మంగళవారం జరగనుంది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే రథోత్సవాన్ని తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ క్రమంలో వారికి ఇబ్బందులు కలగకుండా గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. మఠం ఆవరణలో మంగళవారం అన్నదాన సేవ ఉంటుంది. రథోత్సవంలో గజలక్ష్మి (ఏనుగు)ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. గుంతకల్లు డీఎస్పీ ఆదేశాల మేరకు రథోత్సవంలో పోలీసులు బందోబస్తు చేపట్టనున్నారు.



రథోత్సవం సందర్భంగా గవిమఠాన్ని విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం



భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు ←

రథోత్సవం కోసం రప్పించిన గజలక్ష్మి →



రథం నిర్మాణ టెండర్లలో అక్రమాలకు తావే లేదు

- పెన్నహోబిలం ఆలయ ఈఓ విజయ్‌కుమార్ స్పష్టీకరణ
- ఎల్లో మీడియా పిచ్చి రాతలపై ఆగ్రహం
- భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దని హితవు



ఉరవకొండ: పెన్నహోబిలం శ్రీవారి రథం నిర్మాణ టెండర్లలో అక్రమాలకు తావే లేదని ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. రథం నిర్మాణ టెండర్లలో అవకతవకలు జరిగాయంటూ ఎల్లో మీడియాలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. సోమవారం పెన్నహోబిలంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తప్పుడు కథనాలు ప్రచురించడం భావ్యం కాదన్నారు. రథం నిర్మాణానికి రూ.2.30 కోట్లతో అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు మాత్రమే పంపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే రథం నిర్మాణ టెండర్ ప్రక్రియలో ఇద్దరు పాల్గొన్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్ విధానంలో రివర్స్ టెండరింగ్ ద్వారా ఓ వ్యక్తి రూ. 1,78,27,627కు టెండర్ దక్కించుకున్నారన్నారు. టెండర్‌దారు ప్రభుత్వానికి జీఎస్టీ 18 శాతం, సెస్ 5 శాతం, టీడీఎస్ 2 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరిగిందని, ఇందులో ఏ ఒక్కరి ప్రమేయమూ లేదన్నారు. ఇవన్నీ తెలుసుకోకుండా రూ. కోటి స్వాహా చేశారంటూ అసత్య కథనాలు ప్రచురించడం సరికాదన్నారు.

న్యాయబద్ధంగానే టెండర్ దక్కించుకున్నాం

అనంతపురం టవర్‌క్లాక్: పెన్నహోబిలం శ్రీవారి రథం నిర్మాణ టెండర్‌ను న్యాయబద్ధంగానే దక్కించుకున్నామని కాంట్రాక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ రథం నిర్మాణానికి 2022లో టెండర్లు పిలిచారని, ఒకే టెండర్ ఉండడంతో రద్దు చేశారన్నారు. 2023 అక్టోబర్‌లో మరో దఫా టెండర్ పిలవగా, నలుగురు కాంట్రాక్టర్లు పాల్గొన్నట్లు తెలిపారు. ఆ సమయంలో 2 శాతం లెస్ టెండర్ వేయడంతో తనకు దక్కిందన్నారు. అయితే, రూ.1.70 కోట్ల విలువ చేసే టెండరు కావడంతో ప్రభుత్వ నిర్ణయం మేరకు రివర్స్ టెండరింగ్ పిలిచారన్నారు. ఈ క్రమంలోనే ఇద్దరు కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకోగా, అందులో తమకు టెండర్ కేటాయించారన్నారు. ఇందులో ఎక్కడా అధికార పార్టీ నాయకుల ప్రమేయమే లేదని తెలిపారు. అయితే, ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో తమ పేర్లను కనబరుస్తూ అక్రమాలు జరిగాయని ప్రచురించడం అన్యాయమన్నారు. 43 అడుగుల రథం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, ఏడాదిలో పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

క్లుప్తంగా

వైఎస్‌ జగన్‌ వెంటే క్రైస్తవ మైనార్టీలు

- వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్‌ మైనార్టీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బాబు, తదితరులు

అనంతపురం కల్చరల్‌: క్రైస్తవ మైనారిటీలెప్పుడూ సీఎం వైఎస్‌ జగన్‌ వెంటే ఉంటారని ఆ పార్టీ క్రిస్టియన్‌ మైనార్టీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు స్పష్టం చేశారు. జిల్లా పాస్టర్ల వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రెవరెండ్‌ రెడ్డివారి నెహెమ్యా నాగరాజుతో కలసి సోమవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమాన్ని స్థానిక సీఎస్‌ఐ చర్చిలో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. హోలీ ట్రినిటీ చర్చి చైర్మన్‌ రెవరెండ్‌ పీడీఎస్‌జే బెన్హర్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే నగరంలోని పలు ప్రార్థనా మందిరాల సంఘ కాపరులను కలసి సీఎం వైఎస్‌ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్‌ జాయింట్‌ సెక్రటరీ పాస్టర్‌ మనుష్షే, బిషప్‌ వాసు అనిల్‌కాంత్‌, పాస్టర్‌ అబ్రహం, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



మలరాయుడు (ఫైల్‌)

ఆత్మకూరు: వడదెబ్బ సోకి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు... ఆత్మకూరు మండలం వై.కొత్తపల్లికి చెందిన మలరాయుడు (55) సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పనిపై ఎండలోనే తిరిగాడు. అనంతరం పనిపై ఆత్మకూరుకు వచ్చిన ఆయన ఆస్పత్రి వద్దకు చేరుకుని ఓ బండి వద్ద జ్యూస్‌ తాగి కాసేపు కూర్చొన్నాడు. అనంతరం ఉన్నఫళంగా పక్కకు ఒరిగిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే ఉపశమన చర్యలు చేపట్టారు. అప్పటికే అచేతనంగా మారిపోయాడు. సమాచారం అందుకున్న బంధువులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వడదెబ్బ సోకి మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

గుంతకల్లు: స్థానిక జీఆర్‌పీ పరిధిలోని గుంతకల్లు – బళ్లారి రైలు మార్గంలో బంటనహాల్‌ రైల్వేస్టేషన్‌ వద్ద పట్టాలపై ఓ గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సున్న వ్యక్తి... 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, ఆరంజ్‌ కలర్‌ చొక్కా, బ్రౌన్‌ కలర్‌ ప్యాంట్‌ ధరించి ఉన్నాడు. ప్రమాదవశాత్తు పడి చనిపోయాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మిస్సింగ్‌ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా 94406 27670, 95501 11589లో సంప్రదించాలని కోరారు.

ప్రాణం పోస్తారనుకుంటే.. తీశారు!

- వంశీ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం
- క్రిటికల్‌ కేసును రెఫర్‌ చేయకుండా నిర్లక్ష్యం
- వైద్య పరీక్షల పేరుతో చికిత్స జాప్యం
- ఆస్పత్రిని సీజ్‌ చేయాలంటూ నిరసన





మృతుడు యుగంధర్‌, ఆస్పత్రి ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, జేఏసీ నాయకులు

అనంతపురం: వైద్యోనారాయణో హరిః అన్నారు పెద్దలు. వైద్యుడిని సాక్షాత్తు దేవుడితో పోల్చుకుని గౌరవిస్తారు ప్రజలు. అయితే డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు ప్రైవేట్‌ ఆస్పత్రులు నిర్వహిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ నెల 15న అనంతపురంలోని శ్రీనివాస న్యూరో అండ్‌ మల్టీ సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి ఇంటర్‌ విద్యార్థిని అంకిత మృతి చెందిన విషయం మరువకనే మరో ఘటన వెలుగు చూసింది. ప్రాణాలు పోస్తారనుకుని ఆస్పత్రికి తీసుకువస్తే ఉన్న ప్రాణాలు తీసేశారంటూ మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు.

ఏం జరిగింది?

శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన యుగంధర్‌ (27) రక్త విరేచనాలతో బాధపడుతుంటే ఆదివారం సాయంత్రం అనంతపురంలోని అరవింద్‌నగర్‌లో ఉన్న వంశీ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకువచ్చారు. అప్పటికే రోగి పరిస్థితి విషమంగా ఉంది. ఇలాంటి తరుణంలో క్రిటికల్‌ కేసును వెంటనే సర్వజనాస్పత్రికి రెఫర్‌ చేయాల్సి ఉన్నా... ప్రైవేట్‌ ఆస్పత్రి నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వివిధ రకాల వైద్య పరీక్షల పేరుతో కాలయాపన చేశారు. దీంతో పరిస్థితి విషమించి సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు యుగంధర్‌ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం ఆమె గర్భిణి. ఘటనతో బాధిత కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఆగ్రహంతో రగిలిపోయారు. ఆస్పత్రిలోని అద్దాలు ధ్వంసం చేశారు.

వైద్యుల నిర్లక్ష్యమే ఉసురు తీసింది

విషమ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న యుగంధర్‌కు సకాలంలో వైద్యం అందించకుండా వైద్య పరీక్షల పేరుతో ప్రైవేట్‌ ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం చేశారని, ఫలితంగా యుగంధర్‌ మృతికి కారణమయ్యారంటూ బాధిత కుటుంబసభ్యులు వంశీ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వీరికి ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ప్రతినిధులు, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వైద్యం తెలియని వారు సిండికేట్‌గా ఏర్పడి ధనార్జనే ధ్యేయంగా వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే వంశీ ఆస్పత్రి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన కారులకు నచ్చచెప్పి నిరసనలు విరమింపజేయించారు.

డీఎంహెచ్‌ఓ ఘెరావ్‌

యుగంధర్‌ మృతి సమాచారం అందుకున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి వెంటనే స్పందించారు. తక్షణమే వంశీ ఆస్పత్రికి ఆమె చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ప్రజా సంఘాల నాయకులు, మృతుడి కుటుంబసభ్యులు ఆమెను ఘెరావ్‌ చేశారు. తమ కుటుంబసభ్యుడిని పొట్టన పెట్టుకున్న ఆస్పత్రి యాజమాన్యంపై క్రిమినల్‌ కేసు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. డబ్బు కోసం కక్కుర్తిపడి ప్రాణాలు తీసేశారంటూ బోరున విలపించారు.

షోకాజ్‌ నోటీసు జారీ

అనంతపురం మెడికల్‌: వంశీ ఆస్పత్రి నిర్వాహకులకు డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ భ్రమరాంబదేవి షోకాజ్‌ నోటీసు జారీ చేశారు. యుగంధర్‌ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె నేరుగా ఆస్పత్రికి చేరుకుని పరిశీలించారు. రోగి మృతికి కారణాలపై ఆరా తీశారు. ప్రమాదకర కేసులను హయ్యర్‌ ఇన్‌స్టిట్యూట్‌కు పంపకుండా జాప్యం చేయడం, ఇతర కారణాలు చూపుతూ ఆస్పత్రి నిర్వాహకులకు షోకాజ్‌ నోటీస్‌ జారీ చేశారు. ఘటనపై లోతైన విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ వెంట డెమో ఉమాపతి, డిప్యూటీ డెమో గంగాధర్‌ తదితరులున్నారు.



బోరున విలపిస్తున్న కుటుంబసభ్యులు

పని ప్రాంతంలో వెల్డింగ్‌ కార్మికుడి మృతి

ముదిగుబ్బ: పని ప్రాంతంలో పైనుంచి కిందపడి వెల్డింగ్‌ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు... అనంతపురంలోని రాణినగర్‌కు చెందిన జిలాన్‌ (50) వెల్డింగ్‌ పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ముదిగుబ్బ మండలం రాళ్లఅనంతపురం వద్ద గోదాములో కొన్ని రోజులుగా వెల్డింగ్‌ పనుల్లో ఆయన నిమగ్నమై ఉన్నాడు. ఆదివారం రాత్రి పనుల్లో నిమగ్నమైన ఆయన ప్రమాదవశాత్తు పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

వీరాపురం స్కూల్‌ టీచర్లకు షోకాజ్‌ నోటీసులు

అనంతపురం ఎడ్యుకేషన్‌: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాయదుర్గం మండలం టి.వీరాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంతో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులకు షోకాజ్‌ నోటీసులు జారీ అయ్యాయి. వివరాలు... సోమవారం ఉదయం టి.వీరాపురంలోని ప్రాథమిక పాఠశాలను పాఠశాల విద్య రీజనల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ రాఘవరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పలువురు విద్యార్థుల నోట్‌బుక్స్‌, వర్క్‌బుక్స్‌ పరిశీలించారు. వాటిని సంబంధిత టీచర్లు కరెక్షన్‌ చేయలేదు. అకడమిక్‌ కేలండర్‌ మేరకు సిలబస్‌ కూడా పూర్తి చేయలేదని గుర్తించారు. దీంతో అసహనానికి లోనైన ఆయన వెంటనే పీఎస్‌హెచ్‌ఎం ఎస్‌హెచ్‌ నరసింహమూర్తి, ఎస్జీటీలు కె.లేపాక్షి, బి.సుమిత్ర, డి.మంజులకు షోకాజ్‌ నోటీసులు జారీ చేయాలని డీఈఓ వరలక్ష్మిని ఫోన్‌లో ఆదేశించారు. ఈ క్రమంలో వారందరికీ షోకాజ్‌ నోటీసులు జారీ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారులకూ ప్రవర్తనా నియమావళి

- అధికార పార్టీలతో పాటు వర్తింపు
- స్పష్టం చేసిన ఎన్నికల సంఘం

అనంతపురం అర్బన్‌: ఈ నెల 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్‌ ప్రకటించిన మరుక్షణం నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ప్రజాప్రతినిధులు అధికారికంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకూడదు. ఎన్నికల సమయంలో తమ అధికారాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదు. ఈ విషయాన్ని ప్రవర్తనా నియమావళిలో ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ప్రస్తావించింది. నియమావళిని పాటించకపోతే ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘించినట్లే అవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాధికారులు, ఉద్యోగులకూ ప్రవర్తనా నియమావళి వర్తింపజేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇకపై ప్రజాప్రతినిధులకు ఎలాంటి పరిస్థితుల్లోనూ అధికారులు, ఉద్యోగులు ప్రోటోకాల్‌ పాటించరాదు. ప్రజాప్రతినిధుల వద్ద పీఏలుగా, పీఆర్‌ఓలుగా, ఫొటోగ్రాఫర్లుగా ఉన్న ప్రభుత్వ నియమిత ఉద్యోగులు తిరిగి వారి సొంత శాఖల్లో రిపోర్ట్‌ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజాప్రతినిధులు నిర్వహించే సమావేశాలకు అధికారులు హాజరు కాకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

అధికార పార్టీకి నియమావళి

- కేంద్రంతో పాటు రాష్ట్రంలోని అధికార పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారానికి అధికార హోదాని దుర్వినియోగం చేయరాదు.
- ప్రజాప్రతినిధులు తమ పర్యటనలను, ఎన్నికల పనిని కలిపి నిర్వహించకుండా జాగ్రత్తపడాలి. ఎన్నికల పనికి పాలనా యంత్రాగాన్ని, సిబ్బందిని ఉపయోగించకూడదు.
- అధికారంలో ఉన్న పార్టీ ప్రయోజనాల కోసం ప్రభుత్వం సమకూర్చిన విమానాలు, హెలికాప్టర్లు, ఇతర వాహనాల సౌలభ్యాలతో పాటు పాలనా యంత్రాగాన్ని, సిబ్బందిని వినియోగించరాదు.
- ఎన్నికల సభలను నిర్వహించేందుకు ఉపయోగించే మైదానాలు వంటి బహిరంగ ప్రదేశాలను, హెలీప్యాడ్‌లను తమ కోసం వినియోగించుకోరాదు. ప్రదేశాలను, సౌకర్యాలను అధికారంలో ఉన్న పార్టీ ఏ షరతులపై వాటిని ఉపయోగిస్తారో... అవే షరతులపై ఇతర పార్టీలు, అభ్యర్థులు ఉపయోగించుకోవడానికి అనుమతించాలి.
- ప్రజాప్రతినిధులు ప్రభుత్వ విశ్రాంతి గృహాలు, బంగ్లాలు, ఇతర ప్రభుత్వ వసతి సౌకర్యాలను వినియోగించరాదు.
- వార్తాపత్రికల్లోనూ, ఇతర మీడియాల్లోనూ ప్రజాధనం వెచ్చించి ప్రకటనలు ఇవ్వరాదు. ఎన్నికల ప్రచారం కోసం ప్రభుత్వ మాస్‌ మీడియాని ఉపయోగించరాదు.
- ఎన్నికల నిర్వహణ తేదీలను ప్రకటించినప్పటి నుంచి మంత్రులు, ఇతర అధికారులు తమ కోటా నిధుల నుంచి ఎలాంటి గ్రాంట్లు, చెల్లింపులు చేయరాదు. ఏ రూపంలోను, వాగ్దానాల గానూ ఎలాంటి ఆర్థిక గ్రాంట్లను ప్రకటించరాదు.
- ఏ ప్రాజెక్టులు, పథకాలకు శంకుస్థాపనలు చేయరాదు. రోడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు వంటి విషయాల్లో వాగ్దానాలు చేయరాదు.
- ప్రభుత్వంలోనూ, ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ ఎలాంటి అడహక్‌ నియామకాలు చేయరాదు.

అధికారులు చేపట్టాల్సినవి

- ఎన్నికల కమిషన్‌ ఆదేశాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలి. అధికార పార్టీకి అనుకూలత చేకూర్చే ప్రతి చర్యా కోడ్‌ ఉల్లంఘన కిందకు వస్తుంది. అలాంటి వాటిని అధికారులు నియంత్రించాలి.
- ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల చిత్రపటాలను తొలగించాలి.
- రాజకీయ నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగులు వేయాలి.
- ప్రభుత్వ పథకాల ప్రచారానికి సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలి.
- ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ గోడల మీద ఉన్న రాతలను తుడిచేయాలి.
- ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న స్లోగన్‌లను తొలగించాలి.
- ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు, పోస్టర్లను ముద్రించి పంపిణీ చేయకుండా చూడాలి. అలా చేసే వారిపై ఎంసీసీ ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలి.

హంద్రీ-నీవాకు నీటి పంపింగ్‌ నిలుపుదల

అనంతపురం సెంట్రల్‌: హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకానికి సోమవారం నీటి పంపింగ్‌ను అధికారులు నిలిపి వేశారు. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం తగ్గిపోవడంతో పంపింగ్‌ నిలుపుదల చేసినట్లు ఎస్‌ఈ దేశానాయక్‌ తెలిపారు. మంగళవారం వరకూ జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు వస్తాయని, ఈ క్రమంలో రిజర్వాయర్‌ దిగువకు మరో వారం రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. కాగా, గతేడాది ఆగస్టు 18న హంద్రీ-నీవాకు కృష్ణాజలాల రాక మొదలైంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో జలాశయంలో నీటి మట్టం తగ్గిపోయింది. దీంతో నీటి పంపింగ్‌ను నిలిపి వేశారు. కాగా, వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలోనూ ఏకంగా ఈ నెల 18వ తేదీ వరకూ నీటిని పంపింగ్‌ చేయడం గమనార్హం. ఈ ఏడాది మొత్తం 31.084 టీఎంసీలను హంద్రీనీవాకు ఎత్తిపోశారు. ఇందులో ప్రవాహ నష్టాలు పోనూ కర్నూలు జిల్లాకు 4.233 టీఎంసీలు, అనంతపురం జిల్లాకు 17 టీఎంసీలు, చిత్తూరు జిల్లాకు 1.676 టీఎంసీలను ఇప్పటి వరకూ విడుదల చేశారు. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీలు, గొల్లపల్లి రిజర్వాయర్‌లో 0.387 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గ్రామాల్లో భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయనే ఉద్దేశంతో ఫేజ్‌-1లో 14 చెరువులు, ఫేజ్‌-2లో 50 చెరువులను హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌ అధికారులు నింపారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం 4.943 టీఎంసీలను సాగు నీటి అవసరాలకు కేటాయించారు.

మూడు షాపుల్లో చోరీ

గుత్తి: స్థానిక మూడు దుకాణాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. మరో మూడు షాపుల్లో చోరీకి విఫలయత్నం చేశారు. వివరాలు.. గుత్తి ఆర్‌ఎస్‌ రోడ్డులోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా న్యాయవాది నదీముల్లా మహమ్మద్‌ ఇస్మాయిల్‌ కార్యాలయంలోకి చొరబడిన దుండగులు బీరువాలో ఉంచిన రూ. 2 వేలు నగదు అపహరించారు. అనంతరం తాడిపత్రి రోడ్డులోని కెనరా బ్యాంకు కాంప్లెక్స్‌లో ఉన్న అశోక్‌ డిజిటల్‌ సేవా కేంద్రంలో ట్యాబ్‌, కొంత నగదు ఎత్తుకెళ్లారు. మహబూబ్‌ బాషా ఫొటో స్టూడియోలోనూ కొంత నగదు అపహరించారు. అలాగే ముత్తూట్‌ ఫైనాన్స్‌, ఎలక్ట్రికల్‌ షాపు, జ్యువెలరీ షాపులో చోరీకి విఫలయత్నం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతానికి యువరైతు బలి



ఉపేంద్ర (ఫైల్‌)

బొమ్మనహాళ్‌: మండలంలోని గోవిందవాడలో విద్యుత్‌ షాక్‌కు గురై యువ రైతు ఉపేంద్ర (25) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... సోమవారం ఉదయం తన పొలంలో బోరుబావిలో మోటారు దింపి, విద్యుత్‌ కనెక్షన్‌ ఇచ్చేందుకు ఉపేంద్ర సిద్ధమయ్యాడు. ఆ సమయంలో విద్యుత్‌ సరఫరా లేకపోవడంతో స్తంభం పైకి ఎక్కి వైర్లు అనుసంధానం చేస్తుండగా ఒక్కసారిగా కరెంట్‌ షాక్‌కు గురై కిందపడ్డాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఉపేంద్రను స్థానికులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య పవిత్ర, రెండేళ్ల వయసున్న కుమారుడు వల్లభ ఉన్నారు.

రూపాయి బిళ్ల మింగిన చిన్నారి



చిన్నారి గొంతులో ఉన్న రూపాయి బిళ్ల

గుత్తి: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన రాజ్‌కుమార్‌, అంజలి దంపతుల నాలుగేళ్ల వయసున్న కుమార్తె ఆకాంక్ష ఆదివారం రాత్రి పొరపాటున రూపాయి బిళ్ల మింగింది. తల్లిదండ్రులు వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్‌ చేశారు.

ఒంటిపూట బడులు ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్‌: వేసవికాలం ప్రారంభం కావడంతో అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో సోమవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. ఉదయం 7.45 గంటల నుంచి 12.30 గంటల వరకు పాఠశాలలు పెట్టుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పెట్టి విద్యార్థులను ఇంటికి పంపుతున్నారు. కాగా పదో తరగతి కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం, ఉదయం పదోతరగతి, మధ్యాహ్నం ఓపెన్‌ స్కూల్‌ పరీక్షలున్న కేంద్రాల్లో జాతీయ సెలవుదినాలు, పండుగలు మినహా మిగతా సెలవు రోజుల్లో పాఠశాలలు నడపాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని పిల్లలను స్కూళ్ల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత మధ్యాహ్నం ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు పంపొద్దని డీఈఓ వరలక్ష్మీ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ సీఈఓ



వైపీ రమణారెడ్డి

అనంతపురం సిటీ: జెడ్పీ డిప్యూటీ సీఈఓగా వైపీ రమణారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డ్వామాలో జిల్లా విజిలెన్స్‌ అధికారిగా పని చేస్తున్న రమణారెడ్డిని ఇన్‌చార్జ్‌ డిప్యూటీ సీఈఓగా డిప్యూటేషన్‌పై కలెక్టర్‌ గౌతమి నియమించిన సంగతి తెలిసిందే. ఉదయం సీఈఓ వైఖోమ్‌ నిదియాదేవిని, మధ్యాహ్నం జెడ్పీ చైర్‌పర్సన్‌ బోయ గిరిజమ్మను విడివిడిగా ఆయన కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. బాధ్యతగా పని చేసి, జెడ్పీకి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు సూచించారు. అనంతరం జెడ్పీలోని అన్ని విభాగాల ఉద్యోగులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎన్‌ఎన్‌కుంటలో చోరీ

రాప్తాడు రూరల్‌: అనంతపురం రూరల్‌ మండలం నరసనాయనికుంటలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన నారాయణనాయక్‌ కుటుంబం ఆదివారం రాత్రి ఇంటిపై నిద్రించారు. పసిగట్టిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 4.7 తులాల బంగారం, 5 తులాల వెండిని అపహరించారు. సోమవారం ఉదయం ఇంట్లోకి వచ్చి చూసిన నారాయణనాయక్‌ కుటుంబ సభ్యులు దొంగతనం జరిగినట్లు గుర్తించి, సమాచారం ఇవ్వడంతో రూరల్‌ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్‌

గుత్తి: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. వివరాలను సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఐ నబీరసూల్‌ వెల్లడించారు. కొత్తపల్లికి చెందిన బొంబాయి నరేష్‌, గుత్తికి చెందిన సాయి, విజయ్‌ అలియాస్‌ బెగ్గర్‌ విజయ్‌ ముఠాగా ఏర్పడి గంజాయిని విక్రయించేవారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం బొంబాయి నరేష్‌ పోలీసులకు పట్టుబడ్డాడు. ఇదే కేసులో పరారీలో ఉన్న సాయి, విజయ్‌ని సోమవారం అరెస్ట్‌ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

అనంతపురం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని, శాంతి భద్రతలకు విఘాతం తలపెడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అనంతపురం నాల్గో పట్టణ సీఐ ప్రతాపరెడ్డి అన్నారు. ఎస్పీ అన్బురాజన్‌ ఆదేశాల మేరకు గ్రామ సభల ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రజలను చైతన్య పరిచారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జెడ్పీ ఉద్యోగులకు డిప్యుటేషన్‌

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్‌ పరిధిలో పని చేస్తున్న ఆరుగురు ఉద్యోగులను డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ సీఈఓ వైఖోమ్‌ నిదియాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం వీరిని బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జెడ్పీ కార్యాలయ ఎస్‌ఏ లెక్కల శ్రీనివాసులును అమరాపురం మండల పరిషత్‌ కార్యాలయానికి బదిలీ చేశారు. ఏఓ షేక్‌ షబ్బీర్‌నియాజ్‌ను శెట్టూరు ఎంపీడీఓ కార్యాలయానికి, పుట్టపర్తిలోని పీఐయూ ఈఈ విభాగంలో ఎస్‌ఏగా పనిచేస్తున్న ఎస్‌.కేశవను జెడ్పీ కార్యాలయానికి, అనంతపురంలోని పీఆర్‌ క్యాంపస్‌లో జేఏగా పనిచేస్తున్న తేజ్‌కుమార్‌రెడ్డిని రొద్దం ఎంపీడీఓ కార్యాలయానికి, ధర్మవరం పీఆర్‌ఐ సబ్‌డివిజన్‌ పరిధిలో జేఏగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరెడ్డిని అనంతపురంలోని డీఎల్‌డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

తాడిపత్రి: వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఖాదర్‌పై జరిగిన దాడికి సంబంధించి టీడీపీకి చెందిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను తాడిపత్రి రూరల్‌ పోలీసులు వెల్లడించారు. ఆదివారం రాత్రి టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్‌ చింబిలి వెంకటరమణ కార్యాలయం సమీపంలో చికెన్‌ సెంటర్‌ వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఖాదర్‌పై అల్లీపీరా మచ్చుకత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు అల్లీపీరాతో పాటు దాడికి ఉసిగొల్పిన చింబిలి వెంకటరమణ, ఆయన సోదరుడిపై కేసు నమోదు చేశారు.

వైభవంగా ఎర్రిస్వామి తాత పరుష

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- పోటాపోటీగా వృషభాల బల ప్రదర్శన



పూజలందుకున్న ఎర్రిస్వామి తాత మూలవిరాట్‌



ఉట్టి కొడుతున్న దృశ్యం

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లిలో వెలసిన ఎర్రిస్వామి తాత పరుష మూడు రోజులుగా వైభవంగా సాగుతోంది. సోమవారం వేకువజామునే ఆలయంలో విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అయ్యవారిపల్లి కాల్వగొంచి నిర్వాహకులు, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఉట్ల పరుష ఉత్సాహంగా జరిగింది. ఉట్టి కొట్టేందుకు అయ్యవారిపల్లి, బొమ్మేపర్తి, బుక్కచెర్ల, కాట్నేకాలువ గ్రామాలకు చెందిన యువకులు పోటీ పడ్డారు. కాగా, ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయం వద్దే ఉదయం నుంచి రాత్రి వరకూ నిరంతరాయంగా అన్నదానం నిర్వహిస్తూ వచ్చారు. దీంతో గ్రామంలో ఏ ఇంట్లోనూ పొయ్యి వెలిగించలేదు. సోమవారం ప్రసన్నాయపల్లికి చెందిన భూమిరెడ్డి మహానందరెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు.

పోటాపోటీగా రాతి దూలం లాగుడు పోటీలు

ఎర్రిస్వామి తాత పరుష సందర్భంగా సోమవారం ఉదయం ఆలయం వద్ద జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 7 జతల దేశీయ వృషభాలను రైతులు తీసుకువచ్చారు. ఒక్కో జతకు 20 నిమిషాల సమయం కేటాయించగా... బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన రైతు గురుయాదవ్‌ వృషభాలు ప్రథమ బహుమతి దక్కించుకున్నాయి. అలాగే ఆత్మకూరు మండలం కుర్లపల్లి గ్రామ రైతు వెంకమ్మ వృషభాలు ద్వితీయ స్థానం, బళ్లారికి చెందిన ఆనంద రెడ్డి వృషభాలు తృతీయ స్థానం, రాయదుర్గం మండలం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన రైతు వీరేష్‌ వృషభాలు నాల్గో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేత వృషభాల యజమానులను నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాప్తాడు సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

కనగానపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అనిల్‌కుమార్



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న కార్యదర్శులు

కనగానపల్లి: కనగానపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అనిల్‌కుమార్‌ను నియమించారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న వెంగన్న అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో కనగానపల్లి ఈఓఆర్డీగా పని చేస్తున్న అనిల్‌కుమార్‌కు అధికారులు ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అనిల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు.

'కూటమి'కి ఓటమి ఖాయం

అనంతపురం కల్చరల్: ప్రజలను నయవంచన చేస్తూ టీడీపీ మరోసారి బీజేపీతో పొత్తు పెట్టుకుందని ఐఎంఎం అధ్యక్షుడు మహబూబ్ బాషా అన్నారు. సోమవారం ఐఎంఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మాయమాటలు చెప్పి టీడీపీని కలుపుకుని 2014లో ప్రజలను మోసం చేశారన్నారు. మరోసారి అదే ఎత్తుగడ వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి మేలు చేసే ఏ ఒక్క అంశం బీజేపీ దగ్గర లేకపోయినా నిస్సిగ్గుగా టీడీపీ పొత్తుకు తహతహలాడిందన్నారు. కేవలం గెలుపు కోసం ఏమైనా చేయొచ్చని నిరూపిస్తున్నారన్నారు. మైనార్టీలకు తీవ్ర నిరాశ కల్గించే సీఏఏ అంశాన్ని కూడా టీడీపీ పొత్తు కోసం అంగీకరించడం బాధాకరమన్నారు. సరైన కారణాలు చెప్పి జనంలోకి రావాలని చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌ను హెచ్చరించారు. తప్పుడు వాగ్దానాలు చేస్తే మరోసారి ఘోరమైన ఓటమి తప్పదని టీడీపీకి హితవు పలికారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

రాప్తాడు: గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత సూచించారు. సోమవారం రాప్తాడు-4, ప్రసన్నాయపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు ఎక్కువగా ఆకుకూరలు, గుడ్డు వంటి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సావిత్రి, సూర్యకళ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పశుగ్రాసం దగ్ధం



కాలిపోతున్న పశుగ్రాసం

రాప్తాడు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పశుగ్రాసం దగ్ధమైన సంఘటన సోమవారం మధ్యాహ్నం రాప్తాడులో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు.. రాప్తాడుకు చెందిన తలారి గోవింద్ వారం రోజుల క్రితం రూ.80 వేలు విలువ చేసే 2 ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు, రూ.40 వేలు విలువ చేసే రెండు ట్రాక్టర్ల వరి గడ్డిని కొనుగోలు చేసి దొడ్డికి చేర్చుకున్నాడు. రెండు రోజుల క్రితం వేరుశనగ పొట్టు, వడి గడ్డి కలిసి వాముగా వేశాడు. వాము సమీపంలోనే విద్యుత్ వైర్లు ఉండడంతో షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు రవ్వలు గడ్డివాముపై పడ్డాయి. ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో గడ్డి వాము పూర్తిగా అగ్నికి ఆహుతైంది. రూ.1.20 లక్షల నష్టం వాటిల్లిందని రైతు తలారి గోవింద్ ఆవేదన వ్యక్తం చేశాడు. స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చినా.. ఫైర్ ఇంజన్ వచ్చేలోపు పశుగ్రాసం మొత్తం కాలిపోయింది. నష్టపోయిన రైతును ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, గ్రామస్తులు కోరారు.

జగన్‌కు అండగా నిలవండి

- ప్రభుత్వం చేసిన మేలు మరువొద్దు
- బీజేపీ, టీడీపీ, జనసేనకు బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే అనంత పిలుపు
- 20వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో మేయర్ వసీం తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో నయవంచక బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు గుణపాఠం చెప్పాలని కోరారు. సోమవారం నగరంలోని 20వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం చేపట్టారు. మొదటగా పవర్ ఆఫీస్ సమీపంలో ఉన్న వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు చేసిన మేలును గుర్తు చేసుకోవాలన్నారు. సంక్షేమాన్ని ఇంటి ముంగింటకే తెచ్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలైనా.. ఈ తరహాలో సేవందించాయో ఆలోచించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా ఇంటి సమీపంలోనే సమస్యలకు పరిష్కారం చూపాలని సచివాలయ, వలంటీర్ వ్యవస్థను సీఎం తీసుకొచ్చారన్నారు. వివిధ పథకాల ద్వారా ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చారన్నారు. సంక్షేమం రూ.2,305 కోట్లు, అభివృద్ధి రూ.1,045 కోట్లు జరిగిందన్నారు. త్వరలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదల చేస్తారని, ఆ మేనిఫెస్టోలో రెట్టింపు సంక్షేమాన్ని అందిస్తామన్నారు. మేలు చేసిన ప్రభుత్వాన్ని అండగా నిలవాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. టీడీపీ, జనసేన బీజేపీ ఉమ్మడిగా చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యిందన్నారు. రాష్ట్రానికి ఏం చేయబోతున్నారో చెప్పలేదని, ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పవన్ కళ్యాణ్ పొంతన లేకుండా మాట్లాడారన్నారు. 2019 ఎన్నికలకు ఆరు నెలల ముందు ప్రధాని మోదీ ఓ టెర్రరిస్టు అని చంద్రబాబు అన్నారని.. ఆనాడు ఎందుకు విడిపోయారు? ఇప్పుడు ఎందుకు కలుసుకున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వర్థ నాయక్, కార్పొరేటర్లు లావణ్య, జయలలిత, దుర్గాదేవి, సాకే చంద్ర, బాలాంజినేయులు, శ్రీనివాసులు, కమల్‌భూషణ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్ర నాయుడు, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్ పీరా, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, శ్రీదేవి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు అనిల్‌కుమార్ గౌడ్, రాధాకృష్ణ, బాబాసలాం, ఏ 1 రఫీ, రామకృష్ణ, కమర్‌తాజ్, ఆసిఫ్, తలారి వెంకటేష్, భారతి, ఉష, శోభాబాయి, పార్వతి, సుజాతరెడ్డి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లలో రూ.800 కోట్ల అభివృద్ధి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- నగరపాలక సంస్థ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తయ్యాయి. అనతి కాలంలోనే నగరం రూపురేఖలు మార్చేసినట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మేయర్ వసీం అధ్యక్షతన నగరంలోని 20వ డివిజన్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి డివిడెర్లకే పరిమితమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి డివిజన్‌లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నగరంలోనే రూ.800 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా నగరంలో అభివృద్ధి జరిగిందన్నారు. విశాలవంతమైన బీటీ, సీసీ రోడ్లు, కాలువలు, అంతర్గత రోడ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో రూ.2 కోట్లకు (ఒక్కో డివిజన్‌లో పైగా) అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చూపుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సుజాత, జయలలిత, లీలావతి, లావణ్య, లక్ష్మి, సాకే చంద్రలేఖ, కమల్‌భూషణ్, సైపుల్లాబేగ్, బాలాంజినేయులు, సంపంగి రామాంజనేయులు, శ్రీనివాసులు, టీవీ చంద్ర మోహన్ రెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

హలీమ్.. రుచికి సలామ్!



హలీమ్‌ను ప్యాక్ చేస్తున్న దృశ్యం

- కేవలం రంజాన్ మాసంలోనే లభించే రుచికరమైన వంటకం
- నగరంలో సందడి చేస్తున్న హలీమ్ సెంటర్లు



నోరూరిస్తున్న హలీమ్

అనంతపురం కల్చరల్: కేవలం రంజాన్ మాసంలోనే సందడి చేసే అరబ్‌ల వంటకం హలీమ్. దీని రుచికి అందరూ సలామ్ చేస్తుంటారు. అరబ్‌లో పుట్టి హైదరాబాద్‌కు చేరిన ఈ వంటకం కొన్ని దశాబ్దాలుగా అనంతలోనూ హల్‌చల్ చేస్తోంది. నగర ప్రధాన వీధుల్లో హలీమ్ తయారీ కేంద్రాలు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి.

శ్రమతో కూడిన తయారీ

హలీమ్ తయారీకి చాలా అనుభవం అవసరం. 30 కిలోలకు పైబడి చేసినప్పుడే రుచికరమైన హలీమ్ సిద్ధమవుతుంది. హలీమ్ తయారీలో పొట్టేలు మాంసం, గోధుమలు, నెయ్యి, కాజు, పిస్తా, బాదమ్, అల్లం, వెల్లుల్లి, పసుపు, మిరియాలు, కుంకుమ పువ్వుతో పాటు మరికొన్ని మసాలాలు కలుపుతారు. వీటన్నింటిని ప్రత్యేకంగా తయారు చేసిన బట్టీలోని పాత్రలో వేసి ఐదు నుంచి ఆరు గంటల పాటు ఉడికిస్తారు. ఆ సమయంలో బరువైన గరిటెతో అందులోని మాంసాన్ని కొడుతూ మొత్తని పేస్ట్‌లా మారుస్తారు. అనంతరం సిద్ధమైన వంటకంపై కాసింత నెయ్యి, వేయించిన ఉల్లిపాయలతో గార్నిష్ చేసి అందజేస్తారు.

నగరానికి పరిచయం చేశాం

ఇంతకు ముందు మేము శ్రీకంఠం సర్కిల్‌లో తమ్ముడు షఫీతో కలసి 2005లో హలీమ్‌ను అనంత వాసులకు పరిచయం చేశాం. ప్రస్తుతం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో రెస్టారెంట్ ఏర్పాటు చేశాం. మా వద్ద రోజూ 15 కిలోల హలీమ్ అమ్ముడు పోతోంది. స్పెషల్ హలీమ్ అయితే 30 కిలోల వరకూ అమ్ముడు పోతోంది. వేరే ప్రాంతాల వారు కూడా మా వద్దకు వచ్చి హలీమ్‌ను కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. – ఖలీల్, కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురం

నెల రోజుల పాటూ అందుబాటులో

మేము అనంతపురంలోని సుభాష్ రోడ్డులో 13 ఏళ్లగా నాణ్యమైన హలీమ్‌ను సిద్ధం చేస్తున్నాం. రంజాన్ మాసంలో నెల రోజుల పాటు రోజూ హలీమ్‌ను సిద్ధం చేస్తుంటాం. మటన్, చికెన్‌తో చేసే రెండు రకాల హలీమ్‌లనూ చాలా మంది ఇష్టంగా భుజిస్తుంటారు. – షబ్బీర్, సుభాష్‌రోడ్డు, అనంతపురం

పన్ను చెల్లించకపోతే కఠిన చర్యలు

- కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: ఏళ్ల తరబడి ఇంటి పన్ను చెల్లించకుండా జాప్యం చేస్తున్న వారిని ఉపేక్షించవద్దు. వారందరికీ నోటీసులు జారీ చేసి ఇంటి కుళాయి కనెక్షన్ తొలగించాలి. కమర్షియల్ కాంప్లెక్స్‌లకు తాళం వేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థలో రెవెన్యూ సిబ్బందికి కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాగే మొండి బకాయిదారులపై కోర్టులో దావా వేసి పన్ను వసూళ్లు చేపట్టాలన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఈనెల 1 నుంచి 31 వరకూ ఇంటి, ఖాళీ జాగా పన్ను వడ్డీ లేకుండా చెల్లించే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. వడ్డీ మాఫీ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకూ 2,348 మంది లబ్ధి పొందారని తెలిపారు. నగరపాలక సంస్థకు రూ.2.10 కోట్లు జమ అయినట్లు వెల్లడించారు. నగరంలో ఇంకా 28,271 మంది పన్ను చెల్లించలేదని తెలిపారు. ఆ మొత్తం వడ్డీతో కలిపి రూ.25.50 కోట్ల బకాయి ఉందన్నారు. నిర్దేశిత సమయంలో పన్నులు చెల్లించాల్సిందేనన్నారు. సమావేశంలో ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు వేణు, మురళీ, పద్మావతి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి సంక్రమణ నివారణ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: వ్యాధి సంక్రమణ నివారణ పద్ధతులను తప్పక పాటించాలి. తద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవచ్చని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డీస్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. సోమవారం సెంట్రల్ టీబీ డివిజన్, షేర్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సారథ్యంలో జీజీహెచ్‌లో వైద్యులు, స్టాఫ్‌నర్సులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సెంటర్ ఫర్ డిజీస్ కంట్రోల్ అట్లాంటా నివేదించిన నివేదికల ప్రకారం రోగుల ద్వారా వ్యాధి సంక్రమణ నివారణ పద్ధతులపై శిక్షణ చాలా అవసరమన్నారు. దీని ద్వారా ఆస్పత్రి నుంచి సంక్రమించే వ్యాధులను నివారించగలమన్నారు. షేర్ ఇండియా ప్రతినిధులు డాక్టర్ సతీష్, డాక్టర్ నీరద, డాక్టర్ సందీప్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాస శౌరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ శాంతిరెడ్డి, డాక్టర్ ఆత్మారాం, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మభ్యపెట్టేందుకు కుట్ర

అనంతపురం ఎడ్యుకేషన్: ఎన్నికల సమయంలో నిరుద్యోగులను మభ్య పెట్టేందుకు ప్రతిపక్షాలు తెర తీశాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు షేక్ బాబా సలామ్ మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతిభకు గుర్తింపు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం వివిధ నోటిఫికేషన్ల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తోందన్నారు. అయితే పరీక్షల నిర్వహణపై ప్రభుత్వంపై నిందారోపణలు చేస్తూ నిరుద్యోగులను గందరగోళ పరిచేలా ప్రతిపక్షాలు పన్నాగం పన్నాయన్నారు. ప్రతిభే కొలమానంగా ప్రభుత్వం పోటీ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేశారన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా పట్టించుకోని 98, 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పించిన చరిత్ర జగనన్నకే దక్కుతుందన్నారు. ఉద్యోగాల భర్తీల్లో అక్రమాలు జరిగాయంటూ యువతను మభ్యపెడుతున్న ప్రతిపక్ష పార్టీలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని యువతకు పిలుపునిచ్చారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ అరికట్టాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా రూపొందించిన కరపత్రాలను విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి ఓతూర్ పరమేష్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు దోపిడీ ప్రారంభించాయన్నారు. విద్యాశాఖ అధికారులకు తెలిసినా ఏమాత్రం స్పందించడం లేదన్నారు. ఏమాత్రం నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల మార్కుల కోసం ర్యాంకుల కోసం లక్ష్యంగా మానసికంగా నైతికంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు వద్దు ప్రభుత్వ విద్య ముద్దు అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆ దిశగా ఆలోచించాలని కోరారు. అనుమతులు లేకుండా విద్యార్థులను ఇబ్బందులు గురి చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల విభాగం కన్వీనర్ రజిత, జిల్లా అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు వైటిసి రమేష్, సిద్దు, వంశీ, జిల్లా సహాయ కార్యదర్శులు గిరి, వెంకీ, చందు, సోమశేఖర్ పాల్గొన్నారు.

'ఎన్డీయేతో ఒరిగిందేమీ లేదు'

అనంతపురం టవర్‌క్లాక్: టీడీపీ, జనసేన ఎన్డీయేతో పొత్తు పెట్టుకోవడం వల్ల ఒరిగిందేమీ లేదని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితో చిలకలూరిపేటలో బహిరంగ సభ నిర్వహించారన్నారు. అందులో నరేంద్రమోదీ రెండు మాటలు తెలుగులో మాట్లాడినంత మాత్రన చప్పట్లు కొట్టడం సరైంది కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై ప్రధాని ఏ మాత్రం ప్రస్తావించలేదన్నారు. ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్‌కు చేసేందేమి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ప్రత్యేక నిధులిచ్చి తుంగభద్ర ఎండిపోయేలా చేశారన్నారు. ఎన్డీయే పాలనలో సామన్య ప్రజలు, పేదలకు న్యాయం జరగలేదన్నారు. 400 ఎంపీ సీట్లు ఇస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తామన్న నరేంద్ర మోదీకి ప్రజలు ఓట్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు గాజుల వాసు తదితరులు పాల్గొన్నారు.

రంగుల జీవితానికి ప్రతీక నిండు పౌర్ణమి



ఇంటింటా భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైతసిద్ధాంత కర్తలు

అనంతపురం కల్చరల్: జీవితం రంగులమయం కావాలని ప్రతి వారు కోరుకుంటారు. ఆ భావనలను ప్రతిఫలించేదే పౌర్ణమి ఘడియలని ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. సోమవారం నగరంలోని పలువీధుల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది. రానున్న ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని ముందస్తు వేడుకలను ప్రభోద సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక వారు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రాముఖ్యతను వివరించారు. హోలీ విశిష్టతను చెబుతూ ప్రతి ఇంటా రంగులు విరజిమ్ముకునేలా జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫక్కీరప్ప, సుధాకర్, ఇందిర, విజయక్క తదితరులు పాల్గొన్నారు.

స్నేహానికి గుర్తుగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం తమ స్నేహితుడి జ్ఞాపకార్థం పలువురు మిత్రులు రక్తదాన శిబిరం నిర్వహించారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సద్దికూటి వెంకట్రామిరెడ్డి ఏడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. చిన్నప్పటి నుంచి తమ మధ్య కలసి చదువుకుని, పెరిగిన వ్యక్తి చనిపోవడం ఆ స్నేహితులకు తీరని బాధను మిగిల్చింది. వెంకట్రామిరెడ్డి మరణించి సోమవారానికి యేడాది కావడంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దాదాపు 30 మందికి యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సద్దికూటి శివారెడ్డి, ఫణిరెడ్డి, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ఆవుల ధనుంజయ రెడ్డి, వేణు, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, పవన్, తరుణరెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి మాజీ ఎంపీటీసీ గుడ్‌బై



మాజీ ఎంపీటీసీ శంకర్ నారాయణరెడ్డి (చిన్నా)

ఆత్మకూరు: బి.యాలేరు మాజీ ఎంపీటీసీ శంకర్ నారాయణరెడ్డి (చిన్నా) టీడీపీకి గుడ్‌బై చెప్పారు. టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శంకర్ నారాయణరెడ్డి (చిన్నా) 2014 సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీటీసీగా గెలుపొందారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో టీడీపీలోకి వెళ్లారు. ప్రస్తుతం టీడీపీ నాయకుల తీరు, చంద్రబాబు ఇస్తున్న మోసపూరిత హామీలు నచ్చక టీడీపీని వీడుతున్నట్లు ప్రకటించారు. త్వరలోనే భవిష్యత్ కార్యవరణ ప్రకటిస్తానన్నారు. అభివృద్ధి వైపే తన పయనం ఉంటుందని తెలిపారు.



ఆత్మకూరు: విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న దృశ్యం



అనంతపురం: విద్యార్థినికి ఆల్ ది బెస్ట్ చెబుతున్న తల్లిదండ్రులు

'పది' పరీక్షలు ప్రారంభం



రాప్తాడు: పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు



అనంతపురం: పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థి

ఆత్మకూరు/రాప్తాడు: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆత్మకూరు మండలంలో మూడు కేంద్రాల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు తెలిపారు. తెలుగు పరీక్షకు మండల వ్యాప్తంగా 643 మంది విద్యార్థులకు గాను 597 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. 46 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. రాప్తాడు మండలంలో ఐదు సెంటర్లలో తెలుగు పరీక్ష జరిగింది. 1,081 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 1,046 మంది హాజరైనట్లు ఆయా సెంటర్ల చీఫ్, డిపార్ట్ మెంటల్ అధికారులు, ఎంఈఓ మల్లికార్జున తెలిపారు. 35 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఆయా కేంద్రాలను మొదటి రోజు స్కాడ్ టీంలు పర్యవేక్షించారు. మండలంలో ఐదు సెంటర్ల దగ్గర సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

నిస్వార్థ సేవలతో సమాజం సుభిక్షం



స్వామీజీ చేతుల మీదుగా మిత్ర అవార్డు అందుకుంటున్న విజయ కుమార్

అనంతపురం కల్చరల్: నిస్వార్థ సేవలతో సమాజం సుభిక్షంగా ఉంటుంది. అందరూ భక్తిమార్గాన్ని, సేవాతత్పరతను అలవరచుకోవాలని మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ మహాస్వామి సూచించారు. సోమవారం ఆయన అనంతకు విచ్చేశారు. భక్తుల ఇంట పాదపూజల్లో పాల్గొన్నారు. మూలరామపూజలు అనంతరం ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఎంతో సుకృతం ఉంటే తప్ప లభించని మానవజన్మను భౌతిక వాంఛలతో నాశనం చేసుకోకుండా అందరికి ఉపయోగపడేలా జీవితాన్ని తీర్చుదిద్దుకోవాలన్నారు. రామకృష్ణ మిషన్ ద్వారా సేవా మిత్ర అవార్డుకు ఎంపికైన నగరవాసి సాయిట్రస్టు విజయ్ కుమార్‌కు పురస్కారం అందించారు. అలాగే వందలాదిగా తరలి వచ్చిన భక్తులకు ఫలమంత్రాక్షతలను అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మంత్రాలయ మఠం సభ్యులు, వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.